# శతక చరిత్ర

అయినంపూడి ప్రమీలాచంద్రమోహన్

మందారం దేవతా పుష్పం. మందారం ప్రతి ఇంటి పెరట్లో ఉంటుంది. మందార చెట్టున్న ఇంటికి అమంగళం చేరదు. మందార పూలతో పూజిస్తే అఖండ విజయం లభిస్తుంది. భూలోక కల్పవృక్షం మందారం.

శతక పఠనం మనిషికి మందారంలా క్షేమాన్నిస్తుంది. కల్పవృక్షంలా జ్ఞాన సంపద నిస్తుందని శతకమందారాలంటాము.

శతక కవుల నైపుణ్యమంతా అమూల్య విషయాన్ని, నిత్య సత్యాలను చిన్న చిన్న పద్యాలతో, తేట మాటలతో చెప్పడంలో కనిపిస్తుంది.

మనిషికి స్నేహితులు మంచి సాహిత్యమే. బుద్ధి బలాన్ని పెంచి, మనో వికాసాన్ని పెంచేవి ఎన్నో. అందులో చేరిందే శతకం.

“ చట్టాన్ని చెపుతుంది శాస్త్రం -
హితాహితాలు చెపుతుంది ఇతిహాసం
బుద్ధులు చెపుతుంది పురాణం,
సుద్దులు చెపుతుంది శతకం” - అంటారు.

శతకం జీవితానికి విజ్ఞానాన్ని అందించే వెలుగుబాట. అశేష ప్రజానీకాన్ని సంతోష పెట్టడమేగాక అనుభవపాఠాన్ని అందిస్తుంది. జీవిత పాఠాన్ని నేర్పుతుంది.

పండుకో రుచిలాగా ఒక్కో శతకానికి అందులోను ఒక్కో పద్యానికి ఒక్కొక్క

రుచి ఉంటుంది.శతకరచన పరమార్థం భిన్నభిన్న అభిరుచులతో జీవించే మానవ సమాజానికి సంతృప్తినియ్యడమే. శతకం గురువులా బోధిస్తుంది. ఆత్మీయుడిలాప లకరిస్తుంది.శ్రేయోభిలాషిలా ప్రోత్సహిస్తుంది.మంచి స్నేహితుడిలా సలహాలిస్తుంది.

ఆనాటి నమ్మకం ప్రకారం శతక పద్యాల వల్ల, స్పష్టమైన ఉచ్చారణ, జ్ఞాపక శక్తి, ఆసక్తి, భాషాజ్ఞానం, శ్రద్ధ, చురుకుదనం అలవడుతుందని, పెద్దలు పిల్లలకు మాటలు వచ్చినప్పటి నుంచి శతకపద్యాలు నేర్పించడం అలవరచుకున్నారు. నమ్మకం మాట ఏమైనా, విద్యా విధానాల్లో ఎన్ని మార్పులు ఉన్నా, మంచిని మన్నించడం ప్రతివారికీ అవశ్యమే.

శతకం నూరుగానీ, నూట ఎనిమిది గాని పద్యాల కూర్పు. అవి ఆకారంలో చిన్న గాని, బోధలో మిన్న. మన దేశంలో శత సంఖ్యకి విశేష గౌరవముంది. అది ప్రజ్ఞ పరిపూర్ణతకి సంకేతం. 'శతాయుష్మాన్ భవ' అని దీవిస్తారు. అలాగే పద్యాల్ని ఒక నియత సంఖ్యలో చెప్పడము,

సాధరణంగా శతకం శ్రీకారంతో ప్రారంభమౌతుంది అదే విధంగా శతకం ఏ వృతంలో ప్రారంభిస్తే వంద పద్యాలు అదే వృత్తంతో కొనసాగుతుంది. ప్రతి పద్యానికి చివర మకుటం ఉంటుంది. మకుటమంటే సంభోదన. పద్యానికదే గుర్తింపు. దాన్ని బట్టి ఈ పద్యం ఫలానా శతకంలోనిది అని చెప్పవచ్చు.

శతకకవులు సర్వస్వతంత్రులు. వారిది ప్రజావాణి. శతకకవులు అందరికీ వందనీయులు, నిత్యస్మరణీయులు.

**********